(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 235 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 04-06 - 2026 పేజీలు : 6 Digital Edition

# 21 మంది మృతి

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**40 మందికి గాయాలు మృతుల్లో అత్యధికులు విదేశీయులే**

**సహాయక చర్యల్లో జాప్యంతో భారీ ప్రాణనష్టం**

**భద్రతా ప్రమాణాలు పాటించని భవన యాజమాన్యం - రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**





**న్యూఢిల్లీ :జూన్ 03**

దేశ రాజధానిలో బుధవారం ఉదయం ఒక హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషాద ఘటనలో 21 మంది నిండు ప్రాణాలు బుగ్గి అయ్యాయి. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. సాకేత్‌లోని మాక్స్ ఆస్ప్రతికి 39 మంది తరలించగా..అప్పటికే వారిలో 18 మంది చనిపోయారు. మిగిలినవారికి చికిత్స అందిస్తున్నామని,**మిగతా 2లో...**



## డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

**ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..**

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్**

**వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి**

**క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ**

**జూన్ 03**

డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన **మిగతా 2లో...**

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

**సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు**

**యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు**

**21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు**

**సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**



**గుంటూరు,జూన్ 03**

ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ **మిగతా 2లో...**


## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

**ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్**

**మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం**

**సిద్దరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు**

**కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి**



**బెంగళూరు,జూన్ 03**

కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక పముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు.

**మిగతా 2లో...**

## ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

**సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ**




# కులదూషణలు దారుణం

**అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం**

**ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన**



**అమరావతి,జూన్ 03**

భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు**మిగతా 2లో...**

## భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ**

**అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన**

**ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ**

**వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి**



## టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

**తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం**

**యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్**



**హైదరాబాద్,జూన్ 03**

తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు **మిగతా 2లో...**



## పెట్టుబడుల వేట

**రష్యా పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ**

**కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు**

**రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు**

**మాస్కో,జూన్ 03**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు.**మిగతా 2లో...**

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

వీరిలో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ కు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని కాంగ్రెస్, ఆమాద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధితుల్లో అత్యధికులు మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారు. ఈ విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో ఉదయం 8.50గంటల సమయంలో ఫ్లరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగానే మంటలు వచ్చాయని చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశానని, బయటకు వచ్చి చూసేసరికి ఒక్కసారిగా మంటలు హోటల్ అంతా వ్యాపించినట్లు కనిపించిందని తెలిపారు. మంటలు చెలరేగిన సమయంలో సీల్డ్ గాజు కిటికీలు, సెన్సార్‌తో పనిచేసే గేట్ల వల్ల సహాయక సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. దీనికి తోడు హోటల్‌లో పరిమితికి మించి జనాభా వున్నట్లు తెలుస్తోంది. కిక్కిరిసిన రూములు, పైగా అగ్ని ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలు కూడా హోటల్ యాజమాన్యం ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఈ భవనానికి లేదు. దీంతో మొత్తంగా హోటల్ ఒక మృత్యుకూపంగా మారింది. చాలా వేగంగా భవనాన్ని పొగ, మంటలు కమ్ముకోవడంతో డజన్ల సంఖ్యలో లోపలివారు తప్పించుకునే వీలు లేకపోయింది.

సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు కిటికీలు బద్దలు కొట్టి, దుప్పట్లు కప్పి లోపల వున్నవారు బయటకు వచ్చేందుకు సాయపడ్డారు. ఐదంతస్తుల ఈ హోటల్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నడుస్తోంది. ఆ లైసెన్స్ ప్రకారం ఆరు గదులకు మాత్రమే అనుమతి వుంటుంది. కానీ భవనం బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, పైన గల ఐదు అంతస్తుల్లో ఏకంగా 25 గదులు వున్నట్లు తెలుస్తోందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. పైన టెర్రస్ కూడా వుందని, అన్ని అంతస్తుల్లోనూ గదులు వున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే బయటపడేందుకు కూడా వీల్లేని రీతిలో అత్యంత అధ్వాన్నంగా ఆ నిర్మాణం వుందని చెప్పారు. అయితే వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలికి రావడంలో ఆలస్యమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



ఆ హోటల్ భవనానికి ఎదురు భవనంలో వుండే అంజుమ్ అనే మహిళ మాట్లాడుతూ పొద్దునే తన తండ్రికి మందులు ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్ళేసరికి ఏదో వాసన వచ్చిందని, ఆ వెంటనే ఒక స్పార్క్‌లా వచ్చిందని, భవనం మంటల్లో చిక్కుకుందని తెలిపారు. పెద్ద ఎత్తున పేలుళ్ళ శబ్దాలు కూడా వినిపించాయన్నారు. చాలామంది ప్రాణాలు కాపాడుకోవడానికి పైఅంతస్తుల నుండి కిందకు దూకేశారని తెలిపారు. వీరిలో మహిళలు కూడా వున్నారన్నారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి వీల్లేకుండా వున్నాయి. ప్రతి ఒక్కరూ తీవ్రంగా కాలిపోయారని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఢిల్లీ పోలీసులు కల్పబుల్‌హోమిసైడ్ అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ భవనం ఎన్నేళ్ళ కాలం నాటిది, యజమాని ఎవరు అన్న వివరాలు కనుగొని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ స్థాయీ సంఘం చైర్మన్ సత్య శర్మ తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్ 03** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కులదూషణలు దారుణం

మొదటిపేజీ తరువాయి

ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం
వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

మొదటిపేజీ తరువాయి

ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. స్జబెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.

ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

మొదటిపేజీ తరువాయి

హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు.

క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు.ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

మొదటిపేజీ తరువాయి

చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్‌వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**జూన్ 03** భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్తుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో
అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్టర్న్ ఎ÷-లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్సి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్ఫి÷డ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# నట్టనడి ఎండాకాలంలో ఘాతుకం

## -దళిత నాయకుడి పశువుల మేత, 50 పైపులు తగలబెట్టిన దుండగులు!

- కుల వివక్షతోనే దారుణానికి ఒడిగట్టారని బాధితుడి ఆవేదన

- కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు-- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్



**తిరుమలాయపాలెం, జూన్ 03**
**( ప్రజా వేదిక) న్యూస్ ప్రతినిధి:**

ఎండ తీవ్రతకు పశువులకు మేత దొరకడమే గగనమైపోయిన తరుణంలో, ఒక దళిత రైతు, విలేకరిపై అగ్రకుల అహంకారంతో కొందరు వ్యక్తులు కక్షసాధింపు చర్యకు పాల్పడ్డారు. ఎంతో కష్టపడి పెంచుకున్న ఎకరం పశువుల మేతను, 50 వ్యవసాయ పైపులను ఉద్దేశపూర్వకంగా తగలబెట్టి బ్బరీడిద చేసిన అమానుష ఘటన కూసుమంచి మండల పరిధిలోని చేగమ్మ రెవెన్యూ పరిధిలో చోటుచేసుకుంది.

**కష్టార్జితంపై నిప్పుల వర్షం**

బాధితుడు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన గోవిందా సురేష్ స్థానికంగా 'సూర్య' పత్రిక విలేకరిగా, ఎమ్మార్పీఎస్ (వీ-ాూ) మండల అధ్యక్షుడిగా ప్రజాసేవలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయనకు కూసుమంచి మండల పరిధిలోని చేగమ్మ రెవెన్యూ పరిధిలో ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈ కఠినమైన ఎండాకాలంలో తన పశువుల ఆకలి తీర్చడం కోసం సురేష్ పగలు రాత్రి కష్టపడి, నీరు పోసి ఆ ఎకరం భూమిలో పశువుల గడ్డిని (మేతను) సమృద్ధిగా పెంచారు.

ఉద్దేశపూర్వకంగానే మంటల వ్యాప్తి!

ఈ క్రమంలో, సురేష్ పొలం పక్క చేని యజమానులైన అగ్రకులానికి చెందిన వ్యక్తులు బుధవారం తమ చేనిలోని మొక్కజొన్న చెత్తకు నిప్పు పెట్టారు. అయితే, పక్కనే ఉన్న సురేష్ దళిత వర్గానికి చెందినవాడనే కుల వివక్షతో, అతనికి ఆర్థికంగా, మానసికంగా భారీ నష్టం చేకూర్చాలనే క్రూరమైన ఉద్దేశంతో ఆ మంటలను కావాలనే సురేష్ చేనులోకి వ్యాపింపజేశారు. క్షణాల వ్యవధిలో మంటలు ఎగసిపడి సురేష్ పెంచుకున్న ఎకరం పశువుల మేత మొత్తం కాలి బూడిదైపోయింది. అంతేకాకుండా, పొలంలో ఉన్న దాదాపు 50 వ్యవసాయ పైపులు కూడా మంటల్లో పూర్తిగా కాలిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది.

**మందకృష్ణ మాదిగ అండ ఉంది.. వదిలిపెట్టేది లేదు!**

ఈ ఘాతుకంపై బాధితుడు గోవిందా సురేష్ తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. "నేను దళితుడినని, నన్ను భయభ్రాంతులకు గురిచేయాలనే కుల అహంకారంతోనే నా మూగజీవాల నోటికాడ కూడు లాగారు. కానీ నా వెనుక ఎమ్మార్పీఎస్ వ్యవస్థ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ కొండంత అండగా ఉన్నారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు దోషులుగా నిలబెట్టి బట్టలు ఊడదీసే వరకు నా పోరాటం ఆగదు" అని ఆయన గర్జించారు.

**పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు**

ఈ దారుణ ఘటనపై బాధితుడు గోవిందా సురేష్ కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గారికి రాతపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

## కొత్తపేట మసీదులో అరబిక్ తాలీమ్.




**బయ్యారం,ప్రజా ప్రతిభ,జూన్ 3.**

కొత్తపేట మసీదులో అరబిక్ తాలీమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇస్లామిక్ విద్యా తరగతులను, ఖురాన్ పఠనాన్ని,మతపరమైన బోధనలను బోధించారు.కొత్తపేట మజీద్ నందు నిర్వహించిన అరబి థాలిమ్ విశ్వాస కార్యక్రమంలో సెలవులలో పిల్లలకు మంచి విధానాలతో అరబీ తాలిమ్ మంచి విధంగా నేర్చుకున్నారన్నారు.ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా పిల్లలందరికి బహుమతులతో సత్కరించారు.

## బండి వెంకటేశ్వర్లు చిన్న కర్మ కార్యక్రమంలో పాల్గొన్న తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ నాయకులు.





**చింతకాని జూన్ 3 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.**

మధిర నియోజకవర్గం, చింతకాని మండలం, తిర్లాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండి రమాదేవి రామారావు తండ్రి బండి వెంకటేశ్వర్లు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ...హాస్పటల్ కుతరలించగా...చికిత్స పొందుతూ జూన్ 1వ తేదీన తెల్లవారి జామున 6 గంటలకు మరణించారు. వారి ఇంటి ఆవరణంలో బుధవారం రోజు జరిగిన చిన్న కర్మ కార్యక్రమంలో తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు,తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని బండి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. తిర్లాపురం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... తిర్లాపురం గ్రామ లో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసి గ్రామపంచాయతీ ఎన్నికల్లో నన్ను వెన్న తట్టి తట్టి గెలిపించి నాకు విజయం సంకూర్చావ్. మీలాంటి వ్యక్తిని ఎప్పుడు గుర్తుపెట్టుకుంటాను. నిస్సందేహంగా, సమాజ శ్రేయస్సు కోసం సొంత స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యాలయానికి దానం చేయడం ఎంతో అభినందనీయం. నేటి తరానికి ఆదర్శప్రాయమైన గొప్ప స్ఫూర్తిదాయకమైన నిర్ణయం. ఇలాంటి సేవా దృక్పథం వల్ల గ్రామాభివృద్ధి తోడ్పడిన మొదటి వ్యక్తి మీరే,శాశ్వత గుర్తింపు భూమిని బహుకరించిన దాతల పేరు మీద గ్రామపంచాయతీ కార్యాలయం భవనం ఉండడం వల్ల, వారి త్యాగం తరతరాలుగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ సందర్భంగా తెలియపరిచారు.

ఈ కార్యక్రమంలో తిర్లాపురం బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు,తిర్లాపురం బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, బీసీ స్టూడెంట్స్ యూనియన్ ఓయూ అధ్యక్షుడు గోద రవీందర్,తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బండి సైదులు, రైతు సంఘ అధ్యక్షుడు సువర్ణ కంటి నాగేశ్వరావు, రేషన్ డీలర్ బండి యాకోబు, గోదా ప్రసాదు, దారెల్లి సురేష్, గోదా వెంకన్న, గోద వీరేందర్, గోదావీరబాబు, బండి గోపీనాథ్, చింతల రామకృష్ణ ,మడిపల్లి రామకృష్ణ , మడిపల్లి మంగరావు, మడిపల్లి నారాయణ,మడిపల్లి సైదులు,మరీదు మధు,మరీదు రామ్ -లక్ష్మణ్ , గోగుల ప్రసాద్ , గోగుల వెంకటేశ్వర్లు,ఐతం రమేష్, దారిల్లి గోపాల్ రావు, కొమ్ము చంద్రరావు, చాపలమడుగు జోగయ్య, పాల్గొన్నారు.

## ఊదారపు నాగేశ్వరరావుకు సన్మానం కార్యక్రమం.



**చింతకాని జూన్ 3 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.**

చింతకాని కేంద్ర సహకార బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఊదారపు నాగేశ్వరరావు బదిలీపై మధిర బ్యాంకుకు వెళ్లుచున్న సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారు బ్యాంకుకు అందించిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు . ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రీటా, సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, కార్యదర్శులు వై శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ వంకాయలపాటి దీపిక , క్యాషియర్ జి.లావణ్య, సిబ్బంది అసిస్టెంట్ ఎం.భవ్య మేసింజర్ పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, పట్టుదల కలిగిన ఆదర్శ నాయకుడు కొమ్ము పెద్ద నరసయ్య

**బోనకల్, జూన్ 03 ప్రజావేదిక ప్రతినిధి:**

కొమ్ము పెద్ద నరసయ్య క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత కలిగిన ఆదర్శవంత నాయకుడని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలు పడి రైతులకు నష్టం చేకూరుస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో సీపీఐ(ఎం) గోవిందపురం ఎల్ మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ భర్త సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కొమ్ము పెద్ద నరసయ్య సంస్మరణ సభ ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత కొమ్ము పెద్ద నరసయ్య చిత్రపటానికి పోతినేని సుదర్శన్ రావు, సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత, సర్పంచ్ మంద కరుణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సంస్మరణ సభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ కొమ్ము పెద్ద నరసయ్య తన జీవితాంతం సీపీఐ(ఎం) అభివృద్ధి కోసం, పేద ప్రజల కోసం జరిగిన పోరాటాలలో పాల్గొని తన క్రమశిక్షణ పట్టుదలను ప్రదర్శించే వారన్నారు. గోవిందాపురం ఎల్ గ్రామ సర్పంచ్ గా భార్య కొమ్ము కమలమ్మ పనిచేసిన ఐదు సంవత్సరాల కాలంలో భార్యకు తోడుగా ఉంటూ గ్రామాభివృద్ధిలో, పేద ప్రజల సమస్యల



పరిష్కారంలో కీలక పాత్ర పోషించారన్నారు. పార్టీపై అసంచలమైన విశ్వాసం కలిగిన వ్యక్తి కొమ్ము పెద్ద నరసయ్య అన్నారు. కొమ్ము పెద్ద నరసయ్య లాంటి వ్యక్తి ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ప్రజా పోరాటాలలో పాల్గొనాలని కోరారు. గోవిందాపురం ఎల్ గ్రామానికి వీర తెలంగాణ రైతాంగ్ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు, చరిత్ర ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కాలయాపన చేస్తూ, పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శల వర్షం కురిపించారు. అన్నదాతలు ఆరుగాలం ఎన్నో కష్టాలు పడి పండించిన మొక్కజొన్న పంటను కూడా కొనుగోలు చేయలేని దౌర్భాగ్య స్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నలు తరలించడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం లారీలను సరఫరా చేయలేని దీనస్థితికి పడిపోయిందన్నారు. బోనకల్ మండలంలో ఆరు సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్నలు ప్రభుత్వం తరలించకపోతే రైతులే లారీలను తెచ్చుకొని కొనుగోలు చేసిన మొక్కజొన్నలను తరలించే పరిస్థితి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గంలో చోటు చేసుకోవటం బాధాకరమన్నారు. ఇంతటి దయనీయ పరిస్థితి రాష్ట్ర ఉపమఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే జరిగితే మిగతా నియోజకవర్గాలలో రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు.

జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధానాలను అమలు చేస్తుందని ఆ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) నిరంతరం దేశవ్యాప్తంగా పోరాటాల నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో రైతులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, కిలారు సురేష్ మాట్లాడారు. ఈ సభలో లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, కొమ్ము శ్రీనివాసరావు, వల్లంకొండ సురేష్, కోట కాటయ్య, ఏడునూతల లక్ష్మణరావు, నల్లమోతు వాణి, పసుపులేటి నరేష్, నల్లమోతు నాగేశ్వరరావు, గుగులోతు నరేష్, మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ, పెద్ద నరసయ్య కుటుంబ సభ్యులు, సీపీఐ(ఎం) శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# తెట్టెలపాడు బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిర్రా కృష్ణయ్యను పరామర్శించిన బి ఆర్ ఎస్ శ్రేణులు

**తిరుమలాయపాలెం జూన్ 3**
**( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి కూరపాటి ఉపేందర్**

ఇటీవల వడదెబ్బకు గురై వారం రోజులు పాటు ఖమ్మం ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొంది డిశ్చార్జి అయి తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిర్రా కృష్ణయ్య ను బుధవారం బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బిల్లగిరి ధనుంజయ్ గీత కార్మిక మోటు దెబ్బ మండల కమిటీ అధ్యక్షులు రెడ్డి మల్ల నరేందర్ గ్రామ సర్పంచ్ చిర్రా నర్సమ్మ తోర్రికొండ వెంకటనారాయణ గుంటి పుల్లయ్య బిల్లగిరి వెంకటేశ్వర్లు వంగూరు మధుబాబు




పగిడిపల్లి బాబు ఈర్ల ఈశ్వర్ చిర్రా కృష్ణ యని పరామర్శించి మనోధర్యంగా ఉండాలని కోరారు.

# బయ్యారం జూనియర్ కాలేజీలో చేరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం.





**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 3.**

బయ్యారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం కలిపిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ తెలిపారు.జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కొరకు కళాశాల ప్రిన్సిపాల్ ని సంప్రదించాలన్నారు.మండలంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,బాలికల కోసం ప్రభుత్వం ఉచిత హాస్టల్ వసతిని కల్పిస్తుంది.పోస్ట్ మేట్రిక్ హాస్టల్ నందు అడ్మిషన్ పొందాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.అడ్మిషన్ ప్రక్రియ వివరాలు:

అర్హత ప్రమాణాలు విద్యార్హత ఇంటర్మీడియట్,డిగ్రీ చదువుతున్న విద్యార్థినిలకు పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఆదాయ పరిమితి:కుటుంబ వార్షిక ఆదాయం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ఉండాలి.

రిజర్వేషన్లు: ఎస్సీ,ఎస్టీ,బీసీ,విద్యార్థినిలకు నిర్దిష్టమైన సీట్లు కేటాయించబడతాయన్నారు. కావల్సిన పత్రాలు– కుల ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం,పదో తరగతి మార్కుల మెమో,స్టడీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు,రేషన్ కార్డు,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న పోస్ట్ మాట్రిక్ హాస్టల్ ను సంప్రాదించాలన్నారు.

# పెరుమాళ్లకు ఘనంగా నివాళులర్పిస్తున్న నాయకులు



**నేలకొండపల్లి జూన్ 3 ప్రజావేదిక న్యూస్**

సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి పోతనబోయిన పెరుమాళ్ళు ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడపర్తి నాగేశ్వరరావు, పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాజారాంపేట గ్రామంలో పోతనబోయిన పెరుమాళ్ళు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పెరుమాళ్ళు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలు ఆయన మాట్లాడుతూ పెరుమాళ్ళు పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నేడు ఆయన ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే పెరుమాళ్లకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు, పీర్లెస్ చారి, భూక్య కృష్ణ, మండల కమిటీ సభ్యులు మార్తి కొండలరావు, దుగ్గి నరసింహారావు, మహమూద్, షేక్ మజీద్, రాయగూడెం శాఖ కార్యదర్శి కొండలు, నవాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, మల్లేశం, యాకయ్య, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి ముక్కరాల నరసింహారావు, కంటూ పుల్లయ్య, గ్రామ మాజీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సందు ఢిల్లీకి ఘనంగా నివాళులు





**నేలకొండపల్లి జూన్ 3 ప్రజావేదిక న్యూస్**

నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామ వాసి ,చుట్టు ప్రక్క గ్రామాలలో వంట మాస్టర్ గా పశువుల వ్యాపారిగా సుపరిచితులు,చెన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సందు డిల్లీ, బుధవారం తెల్లవారుజామున అనారోగ్యం కారణాలవల్ల మృతి చెందడం జరిగింది. వారి పార్థివ దేహాన్ని నేరకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, గ్రామ పెద్దలు గంజికుంట్ల వెంకన్న, చింతనిప్పు సైదులు, మంకెన వెంకటేశ్వరరావు, ఎస్.కె మస్తాన్, నల్లాని మల్లికార్జునరావు, వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగినది..

# వ్యవసాయ భూములు, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## -పంట అవశేషాల దహనం వల్ల నేల సారం తగ్గుతుంది

**బోనకల్, జూన్ 3: ప్రజావేదిక ప్రతినిధి**

వ్యవసాయ భూముల సారాన్ని కాపాడుకోవడం, పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి రైతు, ప్రతి పౌరుడి బాధ్యత అని బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బోనకల్ గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఉపసర్పంచ్ బానోతు కొండ, పంట కాలం ముగిసిన తర్వాత రైతులు మొక్కజొన్న, వరి తదితర పంటల అవశేషాలను కాల్చివేయడం వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే సేంద్రియ పోషకాలు నశించి నేల సారం తగ్గిపోతుందని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పంట అవశేషాలను దహనం చేయకుండా సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.అలాగే పొలాల్లో మంటలు వ్యాపించడం వల్ల చెట్లు, పొదలు కాలిపోవడంతో




పాటు పక్షులు, చిన్న జీవరాశులు ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతకు,మూలాధారమైన చెట్లను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన,వాతావరణన్ని అందించవచ్చని అన్నారు. చెట్లు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు వాతావరణ మార్పులను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.వేసవి కాలంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, ఉపాధి హామీ పనులు, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు తెల్లటి, పలుచని వస్త్రాలు ధరించాలని, సాధ్యమైనంత వరకు ఉదయం వేళల్లోనే ప్రయాణాలు నిర్వహించుకోవాలని కోరారు. తరచూ మంచినీరు తాగడం, ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు పాటించడం,అవసరమన్నారుగ్రామ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ కాపాడాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని,నెలకొల్పేందుకు సహకరించాలని,పిలుపునచ్చారు. పరిశుభ్రత వల్ల అనేక అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మాటా--పాటల ద్వారా రైతులకు, గ్రామ ప్రజలకు వ్యవసాయ భూముల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, వేసవి జాగ్రత్తలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కళారూపాల ద్వారా అందించిన సందేశాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి, వ్యవసాయ శాఖ అధికారి రజిత గ్రామపంచాయతీ సిబ్బంది ఎస్.కె దస్తగిరి మరియు సంబంధిత అధికారులు. రైతులు, ఉపాధి హామీ కూలీలు, స్థానిక గ్రామస్తులు మరియు.. కళాకారులు చాపలమడుగు కోటేశ్వరరావు,

బీరెల్లి రమణ, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, బానోత్ రవి, ముత్తయ్య, వెంకటరత్నం పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాక్రోచ్ ఆందోళనలకు సోనమ్ వాంగ్ చుక్ మద్దతు

హైదరాబాద్: దేశంలో విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూన్ 5లోగా తన పదవికి రాజీనామా చేయకుంటే, జూన్ 6న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపడుతున్న భారీ నిరసన ప్రదర్శనలో తాను కూడా పాల్గొంటానని ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ హెచ్చరించారు. దేశంలో విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులు, సంస్కరణల అమలుపై ఉన్న విస్తృత ఆందోళనలే తన నిర్ణయానికి కారణాలని మంగళవారం ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన ఒక ప్రత్యేక వీడియోలో ఆయన పేర్కొన్నారు.

ఈ ఉద్యమ నిర్వాహకులతో తాను మాట్లాడానని, ఈ పోరాటం భారతీయ యువత ఆవేదనను, వారి గొంతుకను ప్రతిబింబిస్తోందని అన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు యువత ఎంతో కృషి చేస్తోందని, కానీ ప్రస్తుత విద్యావ్యవస్థలోని లోపాలు వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం గత నాలుగు దశాబ్దాలుగా తాను తీవ్రంగా కృషి చేస్తున్నానని గుర్తు చేస్తూ, జాతీయ విద్యా విధానం అమలు తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల పరీక్షలలో జరిగిన అవతవకలు లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి




ఉన్న తీవ్రమైన సమస్య అని, ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇటువంటి భారీ వైఫల్యాలు జరిగినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సోనమ్ వాంగ్ చుక్ ప్రకటనను సిజెపి స్వాగతించింది. "సోనమ్ వాంగ్ చుక్ కాక్రోచ్ ఉద్యమంలో చేరారు. ఆయన ఈ ఉద్యమంలో చేరినందుకు ధన్యవాదాలు. ఇది మా యువతకు దక్కిన గొప్ప గౌరవం. జూన్ 6న మీ కోసం ఎదురుచూస్తుంటాం. జైహింద్ " అని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోషల్ మీడియా ఎక్స్ లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం సాగుతున్న ఈ పోరాటానికి సోనమ్ వాంగ్ చుక్ వంటి ప్రముఖులు మద్దతు తెలపడం తమకు ఎంతో బలాన్ని చేకూర్చిందని అన్నారు. విద్యావ్యవస్థ ప్రక్షాళన కోసం జూన్ 6న ఢిల్లీలో చేపట్టబోయే ఈ శాంతియుత నిరసన ప్రదర్శనలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

# టిఎంసి పార్టీలో చీలిక... 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు

హైదరాబాద్: మమతాబెనర్జీకి భారీ షాక్ తగిలింది. టిఎంసి పార్టీలో చీలిక వచ్చింది. 58 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీపై తిరుగుబాటు చేశారు. టిఎంసి నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా తిరుగుబాటు ఎమ్మెల్యేల తరపున అసెంబ్లీ ప్రతిపక్షనేతగా రితబ్రతా బెనర్జీని గుర్తించాలని అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు.

ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలందరికీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా నాయకత్వం వహిస్తున్నారు. వీరందరినీ ఆయనే ప్రత్యేక బస్సులో అసెంబ్లీ వద్దకు తీసుకెళ్లి స్పీకర్‌కు లేఖ కూడా సమర్పించారు. ఎమ్మెల్యేల మద్దతు ప్రకారం రితబ్రతానే అసెంబ్లీ ప్రతిపక్షనేతగా స్పీకర్ ప్రకటిస్తే.. అసెంబ్లీలో టిఎంసికి ప్రతిపక్ష హోదా కూడా ఉండదు.



కాగా, టిఎంసి శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్షనేతగా ఎన్నుకోవడానికి మద్దతు ఇచ్చింది. అయితే టిఎంసి పార్టీలోని ఎమ్మెల్యేలు శోభన్‌దేవ్‌ని కాకుండా రితబ్రతను ప్రతిపక్షనేతగా మద్దతు ఇచ్చారు. దీంతో పశ్చిమబెంగాల్‌లో కొత్తగా ఈ పరిణామం ముందుకొచ్చింది.